క్లుప్తంగా

వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

గుత్తి రూరల్: మండలంలోని లచ్చానుపల్లి గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహ ఏర్పాటుకు ఏపీ వాల్మీకి, బోయ సంఘం ఆధ్వర్యంలో బుధవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో వాల్మీకి విగ్రహం, మండపం నిర్మించాలని తీర్మానించినట్లు వాల్మీకి సంఘం నాయకులు తెలిపారు. అందులో భాగంగా విగ్రహ ఏర్పాటు నిర్మాణ పనులకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీ వాల్మీకి, బోయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, నాయకులు కొనకొండ్ల సూరి, కొత్త శ్రీధర్ పాల్గొన్నారు.

రేపు గ్రామసభలు

బుక్కరాయసముద్రం/గార్లదిన్నె: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఈనెల 23వ తేదీన నిర్వహించే గ్రామసభలను విజయవంతం చేయాలని ఎంపీడీఓలు తేజోత్స్న, విజయ భాస్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నూతన పనులు ఎంపిక చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం సిబ్బంది, కూలీలు, మేట్లు, శ్రమ శక్తి సంఘాల సభ్యులు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ సెక్రటరీలు పాల్గొనాలని సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన నివేదికలు తయారు చేయాలన్నారు.

రేపు డీఆర్ఎం కార్యాలయం ఎదుట ధర్నా



రైల్వే ఎస్సీ, ఎస్టీ యూనియన్ నేతల మద్దతు కోరుతున్న సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్: రైల్వే ప్రాంతంలోకి ప్రవేశించకుండా నిర్మించిన ప్రహరీలను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23వ తేదీన డీఆర్ఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు తెలిపారు. ఈ ధర్నాకు మద్దతు ఇవ్వాలని బుధవారం సీపీఎం నాయకులు రైల్వే ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ డివిజన్ కార్యదర్శి మురళీకృష్ణను కోరారు. ప్రజలు పెద్ద ఎత్తున ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మారుతి, రమేష్, నాగరాజు,సురేంద్ర, రాము పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ



స్వీట్లు పంపిణీ చేస్తున్న సీఐ నాగార్జున రెడ్డి

యాడికి: మండల కేంద్రంలోని కమలపాడు రహదారిలో ఉన్న అగాపే వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సీఐ నాగార్జున రెడ్డి బుధవారం స్వీట్లు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వాభాద్ర హోమం



హోమం చేస్తున్న అర్చకులు

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం పూర్వాభాద్ర హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ యాగశాలలో సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు తిరుమంజనం నిర్వహించారు. అనంతరం మన్యుసూక్తహోమాన్ని జరిపించారు.

వర్షానికి కూలిన భవనం



శింగనమల: మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలోని ఉల్లికల్లులో ఓ భవనం పైకప్పు కూలిపోయింది. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా.. సదరు భవనంలో అద్దె ప్రాతిపదికన సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. ఉల్లికల్లు గ్రామం చాగల్లు రిజర్వాయర్ ముంపు గ్రామం కావడంతో పంచాయతీలో సచివాలయ భవనం నిర్మించలేదు.

కుండపోత వర్షం

- గుంతకల్లు మండల వ్యాప్తంగా 500 ఎకరాల్లో నీట మునిగిన పంటలు
- నేలకూలిన 10 ఇళ్లు
- పెద్దవడుగూరు సమీపంలో ఉధృతంగా ప్రవహించిన వంకలు



గుంతకల్లు మండలం తిమ్మాపురంలో నీట మునిగిన వేరుశనగ



పెద్దవడుగూరు: పందుల వాగును దాటుతున్న ప్రయాణికులు



గుంతకల్లు మండలం నెలగొండలో నీట మునిగిన కంది

గుంతకల్లు రూరల్: మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి జోరువాన కురిసింది. 40.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గడచిన వారం రోజుల వ్యవధిలోనే మండలంలో దాదాపు 170 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో గ్రామాల్లోని ప్రధాన చిన్నచిన్న కుంటలతోపాటు, ప్రధాన చెరువులు సైతం పొంగి పొర్లుతున్నాయి. మండల వ్యాప్తంగా 150 ఎకరాల్లో వేరుశనగ, 332 ఎకరాల్లో కంది, 12.5 ఎకరాల్లో ఆముదం, 4 ఎకరాల్లో వరి కలిసి మొత్తంగా 505 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇప్పటిదాకా 1,100 ఎకరాల్లో పంటలు నీట మునిగి నష్టం వాటిల్లినట్లు మండల అగ్రికల్చర్ ఆఫీసర్ స్వాతి తెలిపారు. వరద ఉధృతికి కసాపురం–కొంగనపల్లి రహదారి కోతకు గురైంది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తహసీల్దార్ రమాదేవి తక్షణమే అక్కడకు చేరుకుని వరద నీరు వెళ్లేందుకు 16 పైపులను ఏర్పాటు చేయించారు. రోడ్డు మరమ్మతులు చేపట్టారు. చింతలాంపల్లి, కదిరిపల్లి, నాగసముద్రం, అయ్యవారుపల్లి గ్రామాల్లో 10 ఇళ్లు కూలినట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు.

గుత్తి రూరల్: బేతాపల్లి, కరిడికొండ, యంగన్నపల్లి, బ్రాహ్మణపల్లి, పి.ఎర్రగుడి, ఈశ్వరపల్లి, బసినేపల్లి గ్రామాల్లో బుధవారం భారీ కురిసింది. సరిగ్గా మంగళవారం రాత్రి 2:30 గంటలకు ప్రారంభమైన వర్షం.. ఏక బిగిన ఉదయం వరకూ కురిసింది. గుత్తి–పత్తికొండ మార్గంలో బసినేపల్లి వద్ద పెద్ద వంక నీటితో కళకళలాడుతోంది. రోడ్డుపై పారుతున్న వంకను దాటేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లచ్చానుపల్లి గ్రామంలో వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు రాత్రంతా జాగారణ చేశారు. బ్రాహ్మణపల్లి, అబ్బేదొడ్డి, పి.ఎర్రగుడి గ్రామాల్లోని చెరువుల్లోకి భారీగా వరద నీరు చేరింది. 60.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ ఓబిలేసు తెలిపారు.

కొనసాగిన వర్షాలు..

పెద్దవడుగూరు: మండలంలో మూడవ రోజు కూడా భారీ వర్షం కురిసింది. పెద్దవడుగూరు సమీపంలోని పందుల వాగు, పెద్దవంక , చిన్నవంక, పీతల కాలువ, మరువ వంక వర్షం నీటితో పోటెత్తాయి. తెల్లవారుజామున 5 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకూ వాహనాల రాకపోకలు స్తంభించాయి. వర్షం నీటి ప్రవాహానికి చిన్నవడుగూరు వద్ద కాజ్‌వే, పి.వీరన్నపల్లి వద్ద పెద్దవంకపై ఏర్పాటు చేసిన రహదారి పూర్తిగా ధ్వంసమైంది. లక్ష్మంపల్లి జి.వెంకటాంపల్లి, మిడుతూరు, గుత్తిఅనంతపురం, పెద్దవడుగూరు, విరుపాపురం, ఆవులాంపల్లి తదితర గ్రామాల్లో కొర్ర, పత్తి, జొన్న, కంది పంట పొలాలు నీట మునిగాయి. అత్యవసర సేవలకు వినియోగించుకునే 108 వాహనంతో పాటు సుమారుగా 50 వాహనాలు రోడ్డుపై ఆగిపోయాయి.

పాఠశాల ఆవరణలోకి చేరిన నీరు..

పెద్దవడుగూరు: మండల పరిధిలోని లక్ష్మంపల్లి జెడ్పీ పాఠశాల ఆవరణ వర్షపు నీటితో నిండి పోయింది. పాఠశాలలోకి వెళ్లేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర అవస్థలు పడ్డారు. పాఠశాల ప్రక్కన ఉన్న కల్లం దొడ్డి ప్రహరీని పగుల గొట్టుకొని లోపలికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జలదిగ్బంధంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం

గుత్తి: గుత్తిలోని జడ్ వీరారెడ్డి కాలనీ, ఆశానగర్, ఆర్ఎస్‌లోని సుందరయ్య కాలనీ, శుద్ధ ఫ్యాక్టరీ కాలనీలు జలమయం అయ్యాయి. మున్సిపల్ కార్యాలయం, ఐసీడీఎస్ కార్యాలయం, ఏఓ కార్యాలయం, రైతు భరోసా కేంద్రం, ఫారెస్ట్ కార్యాలయం, పశు వైద్య శాల ఆవరణ నీటితో నిండిపోయాయి. ఆర్ఎస్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహం సైతం జలదిగ్బంధంలో చిక్కుకుంది. మోకాళ్ల లోతు నీళ్లు హాస్టల్లోకి చేరాయి. విద్యార్థులు రాత్రంతా ఇబ్బందులు పడ్డారు.

నీటిని తొలగించండి

గార్లదిన్నె: మండల పరిధిలోని కల్లూరు రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలోకి నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం నెలకొంది. బుధవారం రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిని తహసీల్దార్ ఈరమ్మ పరిశీలించారు. మోటార్లు ఏర్పాటు చేసి, నీటిని తొలగించాలని రైల్వే అధికారులకు సూచించారు. వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



గుత్తి రూరల్: లచ్చానుపల్లి వద్ద పెద్ద వంకలో ప్రవహిస్తున్న వర్షపు నీరు



గుత్తి రూరల్: బ్రాహ్మణపల్లి చెరువుకు చేరిన వర్షపు నీరు



పెద్దవడుగూరు: వర్షపు నీటితో పోటెత్తిన పెద్దవంక



గుత్తి: జల దిగ్బంధంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం



పెద్దవడుగూరు మండలం లక్ష్మంపల్లి జెడ్పీ పాఠశాలలో నిలిచిన నీరు



గార్లదిన్నె: కల్లూరులో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఈరమ్మ

బాధ్యతలు స్వీకరించిన సీఐలు



సీఐ ఈరన్న



సీఐ కౌలుట్లయ్య

శింగనమల: శింగనమల సీఐగా కౌలుట్లయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ శ్రీధర్ బుక్కరాయసముద్రం యూపీఎస్ సీఐగా బదిలీ అయ్యారు. సీఐ కౌలుట్లయ్య గతంలో కర్నూలు సీఐడి కార్యాలయంలో సీఐగా పని చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. శింగనమల సర్కిల్ పరిధిలోని శింగనమల, గార్లదిన్నె, నార్పల మండలాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. నార్పల ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, శింగనమల ఏఎస్ఐ చితంబరయ్య తదితరులు సీఐకి శుభాకాంక్షలు తెలిపారు.

యాడికి: యాడికి అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐగా ఈరన్న బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. శ్రీసత్యసాయి జిల్లా నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా యాడికికి వచ్చినట్లు తెలిపారు. మండలంలో పేకాట, మట్కాను ఉపేక్షించేది లేదని తెలిపారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ నాగార్జున రెడ్డి అనంతపురం ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు.

అనధికార లేఔట్లల్లో ప్లాట్లు కొనుగోలు చేయొద్దు

గుంతకల్లు టౌన్: మున్సిపాల్టీ అనుమతి లేకుండా పట్టణ నలుమూలల వెలసిన అనధికార లేఔట్లల్లో ప్లాట్లు కొనుగోలు చేయరాదని మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య, ఏసీపీ అబ్దుల్‌సత్తార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో గుర్తించబడిన అనధికార లేఔట్ (సర్వే నంబర్లు 310, 311, 314, 369–బీ, సీ, 399, 400, 586, 595, 492–ఏ, 118, 403–ఏ2, 729–సీ, 563–ఏ3, ఏ4, 542)లల్లో ప్లాట్లు కొనుగోలు చేసినా రిజిస్ట్రేషన్ కావని స్పష్టం చేశారు. ఇంటి నిర్మాణానికి ప్లాన్ అప్రూవల్ మంజూరు చేసేది లేదని తెలిపారు. అనధికార లేఔట్లు వేసి ఆ ప్లాట్లను ప్రజలకు విక్రయిస్తే స్థలయజమానులు, బిల్డర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వివరాలు సేకరించాలి

పుట్లూరు: ప్రాథమిక సహకార సంఘంలో ఇప్పటికే సభ్యత్వం ఉన్న సభ్యుల వివరాలు సేకరించాలని తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో వీఆర్ఓలు, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ సిబ్బంది, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. రికార్డుల కంప్యూటరైజేషన్ కోసం గ్రామాల్లో సేకరించాల్సిన డేటాను సొసైటీ అధికారులు వివరించారు.

యాజమాన్య పద్ధతులతో లాభాలు



వేరుశనగను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గుత్తి రూరల్: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు అధిక వర్షాల కారణంగా వేరుకుళ్లు తెగుళ్లు ఆశించే అవకాశాలు ఉన్నాయి. రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్.కె.లక్ష్మణ్, సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్.భాస్కర్‌రావు సూచించారు. బుధవారం మండలంలోని వన్నేదొడ్డి, బాచుపల్లి, కరిడికొండ గ్రామాల్లో గుత్తి డివిజన్ ఏడీఏ వెంకట్రాముడుతో కలిసి వ్యవసాయ ప్రదర్శన క్షేత్రాలను పరిశీలించారు. మూడు గ్రామాల్లో ఆముదం, కంది, వేరుశనగ, సజ్జ, కొర్ర పంటలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు పొలాల్లో పెద్ద ఎత్తున నీటిని తొలగించాలన్నారు. వేరుశనగ పంట యాజమాన్య పద్ధతుల్లో భాగంగా 19:19:19 ఎకరాకి ఒక కిలో, అదే విధంగా మైక్రో న్యూటన్ మిక్సర్ ఫార్ములా–4ను అర కిలో చొప్పున పిచికారీ చేయాలన్నారు. పొలాల్లో ఉన్న అధిక తేమ కారణంగా పంటలకు వేరుకుళ్లు ఆశించే అవకాశాలున్నాయన్నారు. వాటి నివారణకు తెగులు నివారించే మందు ఎకరాకి 400 గ్రాములు పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్.రమేష్‌నాయక్, ఏఓ మెహరున్నీసాబేగం, వీహెచ్ఏ అజయ్, ఎంపీఈఓ మెర్సీ, రైతులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలు అమలు చేయాలి



డీఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

గుంతకల్లు: మహిళా చట్టాలను మరింత కఠినంగా అమలు చేయాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్‌ను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరుతూ స్థానిక డీఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్యూటీలో ఉన్న డాక్టర్‌కే రక్షణ లేకపోవడం అత్యంత దారుణమన్నారు. మహిళ ఉద్యోగులపై చేయి వేస్తేనే భయపడేలా చట్టాలను మరింత కఠినతరం చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఏడీఎస్ అశ్విని, పెన్షనర్స్ అసోసియేషన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి మస్తాన్‌వలి నాయకులు శ్రీనివాసులు, ఎస్ఎం బాషా, రాజశేఖర్, రమేష్, వై. సుధాకర్, జాఫర్‌ఖాన్, రమ్య ఎడ్యుకేషనల్ సొసైటీ నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి సత్యసాయి కార్మికుల సమ్మె

గార్లదిన్నె: మండలంలో సత్యసాయి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులు గురువారం నుంచి సమ్మెలోకి వెళ్లనున్నారు. ఆరు నెలలుగా జీతాలు అందకపోవడంతో సమ్మెలోకి వెళ్తున్నట్లు కార్మికులు తెలిపారు. సమస్యలను అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో సమ్మె చేస్తున్నట్లు పేర్కొన్నారు.

లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోండి



పత్తి పంటను పరిశీలిస్తున్న గుత్తి ఏడీఏ వెంకట్రాముడు, ఇతర అధికారులు

పెద్దవడుగూరు: మండలంలో పత్తి సాగు చేసిన రైతులు గులాబీ రంగు పురుగు, పచ్చదోమ నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రేకులకుంట శాస్త్రవేత్త రమేష్ నాయక్, లక్ష్మణ్, అగ్రికల్చర్ ఇంజినీర్ భాస్కర్ రావు, గుత్తి ఏడీఏ వెంకట్రాముడు, ఏఓ మల్లీశ్వరి పేర్కొన్నారు. బుధవారం పెద్దవడుగూరు వద్ద సాగు చేసిన పత్తి పంటను పరిశీలించారు. లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయడం వల్ల కలిగే లాభాలను వివరించారు. ప్రస్తుతం పత్తికి పచ్చదోమ అధికంగా సోకే అవకాశం ఉందని తెలిపారు. దీని నివారణకు ఫ్లోనికామిడ్ 0.4 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. లేదా డై ఫెంథురాన్ 0.3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. తామర పురుగు నివారణకు థయోమెథాక్సిమ్ 0.2 గ్రాములు లీటర్ నీటికి కలిపి లేదా స్పినెటోరమ్ 1 మి.లీ నీటితో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ సునీత, రజిని పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన అవసరం



ప్రిన్సిపాల్ విజయలక్ష్మిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ప్రొఫెసర్ డాక్టర్ వెంకట నాగజయుడు పేర్కొన్నారు. రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో 3 రోజులుగా కొనసాగుతున్న సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో రోజు రోజుకు టెక్నాలజీ పెరుగుతోందన్నారు. విద్యార్థులు సైబర్ సమస్యలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంక్ డిజిటల్ లావాదీవీలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సందస్సులో రీసోర్స్ పర్సన్‌గా జేఎన్‌టీయూ కంప్యూటర్ ప్రొఫెసర్ డాక్టర్ శోభాబిందు, డాక్టర్ శశికళ, సునీత, డాక్టర్ వెంకట జయుడు, డాక్టర్ హేమంత్ కుమార్ యాదవ్, చిన్న పుల్లయ్య వ్యవహరించారు. అనంతరం కొర్రపాడు ఎస్సీ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, కంట్రోల్ ఆఫ్ ఎక్జామినేషన్ డాక్టర్ వెంకట నాగజయుడు, కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ హేమంత్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గార్లదిన్నె: స్థానిక ముస్లిం, మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ మాట్లాడుతూ.. ముస్లిం, మైనార్టీ గురుకుల పాఠశాలలో తాగునీటి వసతి లేదన్నారు. పడుకునేందుకు గదులు లేక బోధించే గదిలోనే పడుకుంటున్నారన్నారు. మరుగుదొడ్లు లేక ఆరు బయటే స్నానాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భోజనం చేయడానికి డైనింగ్ హాల్ కూడా లేదన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు ఇర్ఫాన్, రిజ్వాన్ మహమ్మద్, యూసుఫ్, ఖాదీర్ బాషా, ముస్తఫ్, తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్‌ను దర్శించుకున్న రైల్వే పీసీఓఎం



ఆలయంలో పీసీఓఎం దంపతులు, ఇతర అధికారులు

గుత్తి రూరల్: సేవాగఢ్‌లోని సేవాలాల్ మహరాజ్‌ను సికింద్రాబాద్ రైల్వే ఉన్నతాధికారి ప్రిన్స్‌పాల్ చీఫ్ ఆపరేటింగ్ మేనేజర్ బి.నాగ్యానాయక్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. బుధవారం ఆలయానికి వచ్చిన పీసీఓఎం, గుంతకల్లు డివిజన్ సీనియర్ డీఓఎం శ్రావణ్, సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్‌ను అర్చకుడు మారుతీ ప్రసాద్, ట్రస్టు సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం తీర్థప్రసాదాలు, స్వామి చిత్రపటాలను అందజేశారు. అనంతరం అర్చకుడు మారుతీ ప్రసాద్ ఆలయ విశిష్టతను వివరించారు. అలాగే మాత జగదాంబ అమ్మవారిని పీసీఓఎం దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు భూక్యా వెంకటరమణ, రూపానాయక్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు షెడ్లు మంజూరు చేయాలి

బుక్కరాయసముద్రం: మండలానికి మంజూరైన 50 గొర్రెలు, పశువులు, కోళ్ల షెడ్ల నిర్మాణాల్లో ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం కేటాయించాలని సీపీఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలకు 25 షెడ్లు కేటాయించాల్సి ఉందన్నారు. 14 సచివాలయాల్లో దరఖాస్తులు రాగా వీటిలో 8 సచివాలయాల్లో దళితుల నుంచి ఒక్క దరఖాస్తు కూడా రాలేకపోవడం శోచనీయమన్నారు. ఈ పథకం గురించి అధికారుల ప్రచారం లోపం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర, నెట్టికంటయ్య, సంజీవరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాఘవేంద్ర స్వామి పూర్వారాధన



అలంకరణలో రాఘవేంద్ర స్వామి

తాడిపత్రి అర్బన్: స్థానిక రాఘవేంద్ర స్వామి ఆలయంలో స్వామి వారి ఆరాధనోత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయంలోని బృందావనాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం 5 గంటలకు నిర్మాల్య విసర్జన కార్యక్రమంతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 7 గంటలకు అష్టోత్తర పారాయణం, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాన్ని నిర్వహించారు. 9 గంటలకు తులసీ దళాలతో అర్చన, హస్తోదకం అనంతరం మహామంగళారతి ఇచ్చారు. తీర్థప్రసాదాలు అందజేసి, సాయంత్రం 7 గంటలకు రథోత్సవం నిర్వహించారు.

గుత్తి రూరల్: మండలంలోని ఇసురాళ్ళపల్లి గ్రామం ఆనందాశ్రమంలో రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా రథోత్సవం వైభవంగా జరిగింది. రథంపై స్వామిని కొలువుదీర్చి, ఊరేగించారు. అనంతరం అర్చకులు శుద్ధోదక అభిషేకం, క్షీరాభిషేకం, అష్టోత్తర పారాయణం, పూర్వారాధన, మధ్యారాధన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు దీపాలతో గ్రామోత్సవం నిర్వహించి స్వామి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగించారు.

ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు



వర్షపు నీటిలో నిలబడి నిరసన తెలుపుతున్న మహిళలు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని జడ్‌వీరారెడ్డి కాలనీ భారీ వర్షానికి పూర్తిగా జలమయం అయింది. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో వర్షపు నీరు ఇళ్లలోకి చేరిందని కాలనీవాసులు మండిపడ్డారు. బుధవారం మహిళలు మోకాళ్ల లోతు నీళ్లలో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీ మహిళలు నిర్మల, రేణుక తదితరులు మాట్లాడుతూ.. వర్షం వచ్చినపుడల్లా ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. రాత్రంతా పిల్ల పాపలతో జాగరణ చేయాల్సి వచ్చిందన్నారు. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.